# సాక్షి
## యాదాద్రి భువనగిరి

సోమవారం । 6 । అక్టోబర్ । 2025






**భక్తులు కిటకిట**

యాదగిరిగుట్ట శ్రీలక్ష్మీనరసింహస్వామి వారిని ఆదివారం 40 వేల మందికి పైగా భక్తులు దర్శించుకున్నారు. - 8లో



**క్రీడల్లోనూ రాణించాలి**

విద్యార్థులు క్రీడల్లోనూ రాణించాలని భారత క్రికెట్ మాజీ చీఫ్ సెలెక్టర్ ఎంఎస్‌కే ప్రసాద్ పేర్కొన్నారు. - 8లో



**నిరుపయోగంగా డబుల్ ఇళ్లు**

వంగపల్లిలో నిర్మించిన డబుల్ బెడ్‌రూం ఇళ్లకు రెండేళ్ల కిరతమే లబ్ధిదారులను ఎంపిక చేసినా పొజిషన్ చూపలేదు. - 9లో



భువనగిరి : జిల్లా కేంద్రంలోని ఆర్టీసీ బస్టాండ్‌లో కిక్కిరిసిన ప్రయాణికులు



భువనగిరి : బస్సు ఎక్కేందుకు ఎగబడుతున్న ప్రయాణికులు



చౌటుప్పల్ : జాతీయ రహదారిపై బారులుదీరిన వాహనాలు

## తిరుగు పయనం

భువనగిరి: దసరా సెలవులు ముగియడంతో పండుగకు స్వస్థలాలకు వచ్చిన ప్రజానీకం హైదరాబాద్‌కు తిరుగుపయనం అయ్యారు. ఈ క్రమంలో ఆదివారం జాతీయ రహదారులపై వాహనాలు బారులుదీరాయి. అదే విధంగా భువనగిరి ఆర్టీసీ బస్టాండ్ ప్రయాణికులతో కిటకిటలాడింది. ప్రతి బస్సులో ప్రయాణికులు కిక్కిరిసి ఉండటంతో ప్రయాణికులకు గంటల తరబడి నిరీక్షణ తప్పలేదు.

## న్యూస్‌రీల్

### ప్రజావాణి రద్దు

భువనగిరి: కలెక్టరేట్‌లో ప్రతి సోమవారం నిర్వహించే ప్రజావాణి కార్యక్రమాన్ని రద్దు చేసినట్లు కలెక్టర్ హనుమంతరావు ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. స్థానిక సంస్థల ఎన్నికల నియమావళి అమల్లో ఉన్న నేపథ్యంలో ప్రజావాణి కార్యక్రమాన్ని తాత్కాలికంగా రద్దు చేస్తూ నిర్ణయం తీసుకున్నట్లు పేర్కొన్నారు. ఎంపీటీసీ, జెడ్పీటీసీ, ఎంపీటీసీ, సర్పంచ్ ఎన్నికలు ముగిసిన అనంతరం యథావిధిగా కొనసాగుతుందని, ఫిర్యాదులు ఇచ్చేందుకు ప్రజలు కలెక్టరేట్‌కు రావద్దని కోరారు.

### నేడు పీఓలకు శిక్షణ

భువనగిరిటౌన్ : ప్రిసైడింగ్ ఆఫీసర్లకు (పీఓ) సోమవారం భువనగిరిలోని మండల పరిషత్ కార్యాలయంలో స్థానిక ఎన్నికల నిర్వహణపై శిక్షణ ఇవ్వనున్నట్లు కలెక్టర్ హనుమంతరావు ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. శిక్షణ తరగతులకు తప్పనిసరిగా హాజరుకావాలని, ఎవరైనా సెలవుల్లో ఉంటే రద్దు చేసుకొని రావాలని పేర్కొన్నారు. హాజరుకాని వారిపై చర్యలు తప్పవని హెచ్చరించారు.

**హెల్ప్‌డెస్క్ ఏర్పాటు**

స్థానిక సంస్థల ఎన్నికల నేపథ్యంలో కలెక్టర్ కార్యాలయంలో హెల్ప్‌డెస్క్ ఏర్పాటు చేశారు. సందేహాలు నివృత్తి చేసుకోవడానికి, ఫిర్యాదులు చేసేందుకు 8978928637ను సంప్రదించవచ్చని అధికారులు తెలిపారు.

### యాదగిరి క్షేత్రంలో నిత్యారాధనలు



సుదర్శన హోమం నిర్వహిస్తున్న అర్చకులు

యాదగిరిగుట్ట: యాదగిరి శ్రీలక్ష్మీనరసింహ స్వామి ఆలయంలో ఆదివారం సంప్రదాయ పూజలు శాస్త్రోక్తంగా నిర్వహించారు. వేకువ జామున ఆలయాన్ని తెరిచిన అర్చకులు.. స్వామివారి మేల్కొలుపులో భాగంగా సుప్రభాతం, ఆరాధన సేవలు నిర్వహించారు. అనంతరం గర్భాలయంలోని స్వయంభూ, ప్రతిష్ఠా అలంకారమూర్తులకు నిజాభిషేకం చేసి, తులసీదళ అర్చనతో కొలిచారు. ప్రథమ ప్రాకార మండపంలో శ్రీసుదర్శన నారసింహ హోమం, గజవాహన సేవ, ఉత్సవమూర్తులకు నిత్యకల్యాణం, బ్రహ్మోత్సవం తదితర పూజలు నిర్వహించారు. అనంతరం మండపంలో సువర్ణ పుష్పార్చన మూర్తులకు అష్టోత్తర, సువర్ణ పుష్పార్చన పూజలు గావించారు. సాయంత్రం ఆలయంలో వెండి జోడు సేవను భక్తుల మధ్య ఊరేగించారు. వివిధ పూజా కార్యక్రమాల్లో భక్తులు పాల్గొని మొక్కులు తీర్చుకున్నారు. రాత్రి స్వామి, అమ్మవార్లకు శయనోత్సవం నిర్వహించి ఆలయాన్ని ద్వారబంధనం చేశారు.

# పీసీసీకి జాబితా..

**ఆశావహుల పేర్లను అధిష్టానానికి పంపిన ఎమ్మెల్యేలు**

- ఒక్కో జెడ్పీటీసీ స్థానానికి ముగ్గురు నుంచి ఐదుగురి పేర్లు..
- బీసీ మహిళ, జనరల్ సీట్లలో తీవ్ర పోటీ
- ఏకాభిప్రాయం కుదరని చోట పెండింగ్



సాక్షి, యాదాద్రి: స్థానిక సంస్థల ఎన్నికల్లో అభ్యర్థుల ఎంపిక ప్రక్రియను అధికార కాంగ్రెస్ వేగవంతం చేసింది. జెడ్పీటీసీలుగా బరిలోకి దిగాలనుకుంటున్న ఆశావహుల జాబితాను ఆదివారం రాష్ట్ర నాయకత్వానికి అందజేసింది. జిల్లాలో 17 జెడ్పీటీసీలు ఉండగా ఒక్కో స్థానానికి ముగ్గురు నుంచి ఐదుగురి పేర్లను ప్రతిపాదిస్తూ టీపీసీసీకి పంపింది.

**బీసీ మహిళ, జనరల్ స్థానాల్లో ఫుల్ డిమాండ్**

రాష్ట్ర నాయకత్వం సూచన మేరకు ఒక్కో జెడ్పీ స్థానం నుంచి ముగ్గురి పేర్లను పంపాల్సి ఉంది. కానీ, బీసీ మహిళ, జనరల్ సీట్లలో ఆశావహుల సంఖ్య అధికంగా ఉండటంతో ఐదుగురి పేర్లను ప్రతిపాదించి పీసీసీకి పంపించారు. జాబితా ఆధారంగానే అభ్యర్థులను పీసీసీ ఖరారు చేయనుంది. ఏకాభిప్రాయం కుదరని స్థానాలు ఉంటే వాటిని పెండింగ్‌లో ఉంచి నామినేషన్ల ఉపసంహరణ గడువులోపు సంప్రదింపులు కొనసాగించి అభ్యర్థులను ఖరారు చేయాలనే యోచనలో టీపీసీసీ ఉన్నట్లు తెలుస్తోంది. అయితే జిల్లా ఇన్‌చార్జ్ మంత్రి, జిల్లా మంత్రులు, స్థానిక ఎంపీ, ఎమ్మెల్యే, ఎమ్మెల్సీ తదితర సీనియర్ నేతల అభిప్రాయాలను కూడా పరిగణనలోకి తీసుకోవాలని అధిష్టానం జిల్లా నాయకత్వానికి సూచించింది.

**ఎమ్మెల్యేల మార్క్**

జెడ్పీటీసీ ఆశావహుల జాబితా రూపకల్పనలో ఎమ్మెల్యే మార్క్ కనిపించింది. పార్టీ పట్ల విధేయత, ఆర్థిక బలం, క్షేత్రస్థాయిలో జనాధరణ కలిగి, పార్టీ శ్రేణులను సమన్వయం చేసుకునే నేర్పు కలిగిన నాయకుల పేర్లను పంపాలని పీసీసీ సూచించింది. కానీ, మెజార్టీ ఎమ్మెల్యేలు తమ అనుచరులు, ఎన్నికల్లో తమ విజయంకోసం కీలకంగా పనిచేసిన నాయకుల పేర్లను పీసీసీకి పంపించినట్లు తెలుస్తోంది. జెడ్పీటీసీ అభ్యర్థులను 8వ తేదీన ప్రకటించే అవకాశం ఉంది.

**కోర్టు తీర్పు ఏం వస్తుందో..**

స్థానిక సంస్థల ఎన్నికల్లో బీసీలకు 42 శాతం రిజర్వేషన్లపై సుప్రీంకోర్టులో నేడు, హైకోర్టులో 8వ తేదీన తీర్పు వెలువడనుంది. న్యాయస్థానాలు ఇచ్చే తీర్పుపై సర్వత్రా ఉత్కంఠ నెలకొంది. ఎన్నికలు జరుగుతాయా, వాయిదా పడుతాయా.. కోర్టు తీర్పులతో తేలిపోనుంది.

**డీసీసీ స్థాయిలో ఎంపీటీసీ, సర్పంచ్ అభ్యర్థుల ఎంపిక**

జెడ్పీటీసీ అభ్యర్థుల ఎంపిక టీపీసీసీ స్థాయిలో జరగనుండగా.. ఎంపీటీసీలు, సర్పంచ్‌లు, వార్డు సభ్యులకు సంబంధించి డీసీసీ స్థాయిలో ఖరారు చేయనున్నారు. మండల, గ్రామ స్థాయి కమిటీల అభిప్రాయాల మేరకు మూడేసి పేర్లను ఎమ్మెల్యేలు ఖరారు చేస్తున్నారు. డీసీసీ ఆమోదముద్రతో అభ్యర్థులను ప్రకటించే అవకాశం ఉంది. పలుచోట్ల పోటీ తీవ్రంగా ఉండటంతో ఆచితూచి వ్యవహరిస్తున్నారు. వీలైనంత వరకు సంప్రదింపుల ద్వారా సమన్వయం చేసి ఏకాభిప్రాయం సాధించే దిశగా ఎమ్మెల్యేలు ప్రయత్నిస్తున్నారు.

# లక్ష్యం.. ప్రథమ స్థానం

**‘పది’లో మెరుగైన ఫలితాల సాధనకు కార్యాచరణ**

- నేటి నుంచి ప్రత్యేక తరగతులు
- ప్రతి రోజూ స్లిప్ టెస్ట్‌లు
- డిసెంబర్ 31లోగా సిలబస్ పూర్తి
- గత ఏడాది జిల్లాకు 7వ స్థానం
- ఈసారి మొదటి స్థానంపై గురి



భువనగిరి: పదో తరగతి ఫలితాల్లో యాదాద్రి జిల్లాను గత విద్యా సంవత్సరం రాష్ట్ర స్థాయిలో ఏడవ స్థానంలో నిలిపిన విద్యా శాఖ అధికారులు.. ఈసారి మొదటి స్థానంపై గురిపెట్టారు. ఈ మేరకు తొలి విడతలో 66 రోజులకు ప్రణాళిక రూపొందించారు. దీన్ని సోమవారం (నేడు) నుంచి అమలు చేయనున్నారు. జిల్లాలో పదో తరగతి వరకు ఉన్న ప్రభుత్వ పాఠశాలలు 157, మోడల్ స్కూళ్లు 7 ఉన్నాయి. వాటిలో 4,754 మంది విద్యార్థులు ఉన్నారు. వీరంతా మార్చి నెలలో పబ్లిక్ పరీక్షలు రాయనున్నారు.

**నాలుగేళ్లుగా ఉత్తీర్ణత**

| సంవత్సరం | శాతం | స్థానం |
|---|---|---|
| 2021-22 | 93.61 | 13 |
| 2022-23 | 80.97 | 23 |
| 2023-24 | 90.44 | 25 |
| 2024-25 | 97.80 | 07 |

**కార్యాచరణ ఇదీ..**

- ఉత్తమ ఫలితాల సాధనకు నిపుణులచే రూపొందించిన అభ్యాస దీపికలను నేడు విద్యార్థులకు పంపిణీ చేయనున్నారు.
- నేటి నుంచి డిసెంబర్ 31 వరకు ప్రత్యేక తరగతులు నిర్వహించనున్నారు. సాయంత్రం 4.15 నుంచి 5.15 గంటల వరకు ప్రత్యేక తరగతులు ఉంటాయి.
- వారంలో అన్ని సబ్జెక్టులు కవర్ అయ్యేలా ప్రణాళిక రూపొందించారు.
- రోజూ ప్రత్యేక తరగతుల అనంతరం స్లిప్ టెస్ట్ నిర్వహిస్తారు.
- విద్యార్థులు ఏ సబ్జెక్టుల్లో వెనుకబడి ఉన్నారో గుర్తించి వారిపై ప్రత్యేక శ్రద్ధ తీసుకుని, మెరుగైన ప్రతిభ కనబరిచేలా తీర్చిదిద్దనున్నారు.
- డిసెంబర్ 31 నాటికి సిలబస్ పూర్తి చేస్తారు.
- జనవరి1 నుంచి సిలబస్ రివిజన్ ఉంటుంది. ఉదయం, సాయంత్రం ప్రత్యేక తరగతులు నిర్వహించనున్నారు.

**బాధ్యతగా పనిచేయాలి**



టెన్త్ విద్యార్థులను పబ్లిక్ పరీక్షలకు సన్నద్ధం చేయటానికి ఇప్పటి నుంచే చర్యలు తీసుకుంటున్నాం. ఇందుకోసం 66 రోజుల కార్యాచరణ రూపొందించి ప్రధానోపాధ్యాయులకు పంపడం జరిగింది. నేటినుంచి రోజూ సాయంత్రం ప్రత్యేక తరగతులు నిర్వహిస్తాం. గత సంవత్సరం కలెక్టర్ సొంత ఆలోచనతో వినూత్న కార్యక్రమాలు అమలు చేసి ఉత్తమ ఫలితాలు సాధించడంలో కీలకంగా వ్యవహరించారు. ప్రథమ స్థానం లక్ష్యంగా పనిచేస్తాం. ఉపాధ్యాయులు బాధ్యతాయుతంగా వ్యవహరించాలి.

– సత్యనారాయణ, జిల్లా విద్యాశాఖ అధికారి

**వినూత్న కార్యక్రమాలతో సత్ఫలితం**

గత విద్యా సంవత్సరానికి ముందు వరుసగా మూడేళ్ల పాటు జిల్లా పదో తరగతి ఫలితాల్లో వెనుకబడుతూ వచ్చింది. 2024–25 సంవత్సరానికి ఉత్తమ ఫలితాలు సాధించి రాష్ట్రంలో మెరుగైన స్థానంలో ఉండేలా కలెక్టర్ హనుమంతరావు జిల్లా విద్యాశాఖ అధికారులతో కలిసి వినూత్న కార్యక్రమాలు అమలు చేశారు. వీటిలో వేకప్ కాల్ పేరుతో ఫోన్ చేసి విద్యార్థి ఇంటి తలుపు తట్టడం వంటి కార్యక్రమాలు చేపట్టారు. సంస్థాన్‌నారాయణపురం మండలంలోని ఓ పేద విద్యార్థికి ప్రతి నెలా రూ. 5వేల చొప్పున ఆర్థిక సాయంతో పాటు అతని కుటుంబానికి నిత్యావసర సరుకులు అందజేసి ప్రోత్సహించారు. డీఈఓ, ఎంఈఓలు, ఇతర ఉన్నతాధికారులు సైతం విద్యార్థుల ఇళ్లకు వెళ్లి ఇబ్బందులుంటే పరిష్కరించి పరీక్షల్లో మంచి మార్కులు సాధించేలా కృషి చేశారు. సమష్టి కృషితో జిల్లా రాష్ట్రంలో 7వ స్థానంలో నిలిచింది. పరీక్షలకు ముందు కలెక్టర్ ఇచ్చిన హామీ మేరకు ఉత్తమ ఫలితాలు సాధించిన విద్యార్థులకు ఉచితంగా సైకిళ్లు బహూకరించారు. ఈ కార్యక్రమాలను ఈ విద్యా సంవత్సరం కూడా అమలు చేసి జిల్లాను ప్రథమ స్థానంలో నిలుపేందుకు విద్యాశాఖ అధికారులు భావిస్తున్నారు.

### వెంకటస్వామి యాదిలో..

భువనగిరిటౌన్: మాజీ కేంద్రమంత్రి గడ్డం వెంకటస్వామి జయంతిని ఆదివారం కలెక్టరేట్‌లో నిర్వహించారు. అదనపు కలెక్టర్ వీరారెడ్డి, అధికారులు వెంకటస్వామి చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. ఆయన సేవలను కొనియాడారు.



నివాళులర్పిస్తున్న అదనపు కలెక్టర్, అధికారులు

## శిల్పారామంలో ముగిసిన దసరా ఉత్సవాలు

భువనగిరి: భువనగిరి మండలంలోని రాయగిరి పరిధిలో గల మినీ శిల్పారామంలో సెప్టెంబర్ 29 నుంచి జరుగుతున్న దసరా ఉత్సవాలు అదివారం ముగిశాయి. చివరిరోజు సాంస్కృతిక శాఖ ఆధ్వర్యంలో నిర్వహించిన కార్యక్రమాలు అలరించాయి. హైదరాబాద్‌కు చెందిన తుమ్మాటి ప్రణవి శిష్యబృందం కళాకారులు కూచిపూడి నృత్యం ప్రదర్శించి అలరించారు. సెలవు దినం కావడంతో యాదగిరిగుట్ట శ్రీలక్ష్మీనరసింహ స్వామి క్షేత్రానికి వెళ్లిన భక్తులు తిరుగు ప్రయాణంలో పెద్ద సంఖ్యలో.. మినీ శిల్పారామాన్ని సందర్శించారు. సాంస్కృతిక ప్రదర్శనలను తిలకించారు. చెరువులో బోటు షికారు చేసి, పార్కులో ఉల్లాసంగా గడిపారు. ఈ కార్యక్రమంలో నృత్య కళాకారిణులు అంజని, కీర్తన, సహస్ర, ప్రదీక్ష, రితిక, సాన్వి, దీప్తి తదితరులు పాల్గొన్నారు.



కూచిపూడి నృత్యం చేస్తున్న కళాకారిణులు

# వందల్లో రోగులు.. ఏడుగురే వైద్యులు

**ఆలేరు కమ్యూనిటీ హెల్త్ సెంటర్‌లో వైద్యనిపుణుల కొరత**

- రోగులకు పూర్తిస్థాయిలో అందని సేవలు
- భువనగిరి, జనగామ, ఇతర ఆస్పత్రులకు రెఫర్ చేస్తున్న సిబ్బంది



సీహెచ్‌సీలో చికిత్స పొందుతున్న రోగులు



డెంటల్ విభాగంలో నిరుపయోగంగా యంత్రాలు

ఆలేరు: పేరుకేమో పెద్దాస్పత్రి.. రోగులకు పూర్తిస్థాయిలో సేవలు మాత్రం అందడం లేదు. అవసరమైన సదుపాయలు కల్పించకపోవడం, వైద్యుల కొరత వేదిస్తోంది. ఆలేరు కమ్యూనిటీ హెల్త్ సెంటర్ (సీహెచ్‌సీ) నిపుణులు లేకపోవడంతో జిల్లా కేంద్ర ఆస్పత్రి, ప్రైవేట్ వైద్యశాలలకు వెళ్లాల్సి వస్తోంది. అరకొరగా ఉన్న వైద్యులు కూడా చుట్టపు చూపులా విధులకు హాజరవుతున్నారన్న విమర్శలున్నాయి. ఆస్పత్రికి ఆలేరు పట్టణం, ఆలేరు మండలంతో పాటు, గుండాల, మోటకొండూరు మండలాలు, బచ్చన్నపేట తదితర ప్రాంతాల నుంచి నిత్యం 300 మంది వరకు రోగులు వస్తుంటారు. కానీ, రోగుల సంఖ్యకు తగ్గట్టుగా వైద్యులు లేరు.

**100 పడకలు.. ప్రకటనకే పరిమితం**

కమ్యూనిటీ హెల్త్ సెంటర్ 100 పడకలకు పెంపు ప్రకటనకే పరిమితమైంది. ప్రస్తుతం 30 పడకలే ఉండటం, ఇన్‌పేషెంట్‌లు 50 మంది వరకు వస్తుండటంతో ఇబ్బందులు ఎదురవుతున్నాయి. గత్యంతరం లేని పరిస్థితిలో రోగులు ప్రైవేట్ ఆస్పత్రులను ఆశ్రయిస్తున్నారు.

**ప్రస్తుతం ఉన్న వైద్యులు**

రెండు డిప్యూటీ సివిల్ సర్జన్ పోస్టులకు ఒకటి, అనస్తీషియన్, ఆర్‌ఎంఓ పోస్టులు ఖాళీగా ఉన్నాయి. రెండు సివిల్ అసిస్టెంట్ సర్జన్ పోస్టుల్లో ఒకటి భర్తీ చేయగా, మరొకరిని డిప్యూటేషన్‌పై నియమించారు. రెండు సివిల్ అసిస్టెంట్ సర్జన్స్(పీడియాట్రిక్) పోస్టులు ఖాళీగా ఉన్నాయి. సివిల్ అసిస్టెంట్ జనరల్ సర్జన్ ఖాళీగా ఉంది. డిప్యూటేషన్‌లో రేడియాలాజిస్ట్ భర్తీ చేశారు. డెంటల్ అసిస్టెంట్ సర్జన్ పోస్టు ఖాళీగా ఉంది. ఒక స్టాఫ్ నర్సు, రెండు వార్డు బాయ్స్ పోస్టులు ఖాళీగా ఉన్నాయి. ఇద్దరు గైనకాలాజిస్టులు ఉన్నప్పటికీ రెగ్యులర్‌గా రావడం లేదనే విమర్శలున్నాయి.

**దంత సమస్యలు వస్తే అవస్థలే..**

దంత సమస్యలతో రోజూ కనీసం పది మంది ఆస్పత్రికి వస్తుంటారు. వీరికి చికిత్స చేసే పరిస్థితి లేదు. ఏడాదిన్నరగా డెంటల్ డాక్టర్ పోస్టు ఖాళీగా ఉండటమే కారణం. ఇద్దరు చిల్డ్రన్స్ డాక్టర్లు లేక జ్వరాలు, అంటువ్యాధులు సోకినప్పుడు తల్లిదండ్రులు ప్రైవేట్ ఆస్పత్రులను ఆశ్రయిస్తున్నారు.

**రోజూ 300కు పైగా ఓపీ..**

సాధారణ రోజుల్లో సుమారు 300, సీజన్‌లో 400 వరకు ఓపీ ఉంటుంది. ఓపీ ఆలస్యంగా ప్రారంభించడం వల్ల రోగులు ఇబ్బందులు పడుతున్నారు.రక్త,మూత్ర తదితర పరీక్షలకు నిరీక్షించాల్సిన పరిస్థితి ఉంటుంది. ఆస్పత్రిలో కొన్ని మందులు లభించక ప్రైవేట్‌గా కొనుగోలు చేస్తున్నట్లు తెలుస్తోంది. పలు విభాగాల్లో యంత్రాలు వృథాగా ఉన్నాయి.

**పోస్టుల భర్తీకి ప్రతిపాదన చేశా**

సీహెచ్‌సీలో పలు వైద్యుల పోస్టులు ఖాళీగా ఉన్నాయి. పోస్టుల భర్తీకి ఉన్నతాధికారులకు ప్రతిపాదనలు చేశాను. వైద్యులు విధులకు సరిగా హాజరుకావడం లేదనే విమర్శలు వాస్తవం కాదు. ఉన్న డాక్టర్లతోనే రోగులకు మెరుగైన సేవలందించేందుకు కృషి చేస్తున్నాం.

–స్వప్నరాథోడ్, సీహెచ్‌సీ సూపరింటెండెంట్

**డెంటల్ డాక్టర్ లేరని చెప్పారు**



దంత సమస్యతో వైద్యం కోసం ఆసుపత్రికి వారం క్రితం వెళ్లాను. ఇక్కడ డెంటల్ డాక్టర్ లేరు..జనగాం ,భువనగిరిలోని ప్రభుత్వ ఆసుపత్రికి వెళ్లాలని సిబ్బంది సూచించారు. అక్కడికి వెళ్లలేక ఆలేరులోని ప్రైవేట్ ఆసుపత్రిలో రూ.6వేలు ఖర్చు చేసి, దంత వైద్యం చేసుకున్నాను.

– సీహెచ్.వరుణ్‌కుమార్ ఆలేరు

**ప్రైవేట్‌కు పోవాల్సి వస్తుంది**



ఆలేరు కమ్యూనిటీ హెల్త్ సెంటర్‌లో సరిపోను డాక్టర్లను నియమించాలి. వైద్యుల సమస్యతో పేద, మధ్యతరగతి వర్గాలకు చెందిన రోగులు ప్రైవేట్ ఆస్పత్రులకు వెళ్లాల్సి వస్తోంది. వైద్యుల కొరత లేకుండా జిల్లా అధికారులు చర్యలు తీసుకోవాలి. ఓపీ వద్ద ఆలస్యం వల్ల రోగులు అవస్థలు పడుతున్నారు.

– తునికి దశరథ, బీజేపీ జిల్లా నాయకుడు

**ఉన్న డాక్టర్లు రెగ్యులర్‌గా వస్తలేరు**



ఉన్న వైద్యుల్లో కొందరు రెగ్యులర్‌గా విధులకు రావడం లేదు. దాంతో రోగులకు పూర్తిస్థాయిలో సేవలు అందటంలేదు. జిల్లా వైద్యాధికారుల పర్యవేక్షణ లోపించడం వల్ల ఇక్కడ కొందరు ఇష్టానుసారంగా వ్యవహరిస్తున్నారు. మందుల కొరత కూడా ఉంది. గైనకాలజిస్టులు రెగ్యులర్‌గా వచ్చేలా చూడాలి.

– ఎంఏ ఇక్బాల్, సీపీఎం నాయకుడు

# చేతికొచ్చిన చేనుకు దోమ పోటు

- సుడి దోమతో నల్లబారుతున్న వరి
- దిగుబడిపై ప్రభావం చూపే అవకాశం
- ఆందోళనలో రైతులు



రామన్నపేటలో దోమపోటు సోకిన వరిపొలం

రామన్నపేట: అన్నదాతను సుడిదోమ కలవరపెడుతోంది. వరి కోతకొస్తున్న తరుణంలో పంటను కాటేస్తోంది. ఒక్క పూటలోనే చేనంతా వ్యాప్తి చెంది గింజ నల్లబారి, పొలం ఎండిపోయే ప్రమాదం ఉంది. రైతులు ఏమాత్రం ఏమరుపాటుగా ఉన్నా ఆర్థికంగా నష్టపోయే అవకాశం ఉంది.

**దిగుబడిపై ప్రభావం**

జిల్లాలో 2,82, 897 ఎకరాల్లో వరి సాగు చేశారు. చేలు ఆశాజనకంగా ఉండడంతో ఎకరాకు సరాసరి 25 క్వింటాళ్ల చొప్పున ఏడు లక్షల మెట్రిక్ టన్నుల దిగుబడి వస్తుందని అధికారులు అంచనా వేశారు. మొదట నాటు వేసిన పొలాలు తడితప్పి కోతదశలో ఉన్నాయి. ఈ దశలో సుడిదోమ కాటు (పోటు) తెగులు సోకుతుండటంతో దిగుబడిపై ప్రభావం చూపనుందని రైతులు ఆందోళన చెందుతున్నారు.

**ఈసారి దొడ్డురకానికి..**

సాధారణంగా సన్నరకం వరికి సుడిదోమ బెడద ఎక్కువగా ఉంటుంది. కానీ, ఈసారి దొడ్డురకం చేలకు విపరీతంగా సుడిదోమ ఆశించింది. సెప్టెంబర్‌లో ఎడతెరిపి లేకుండా కురిసిన వర్షాల వల్ల వాతావరణంలో తేమశాతం అధికంగా ఉండడం, మోతాదుకు మించి యూరియా వాడడంతో చేలు ఏపుగా పెరిగాయి. చేనుకు గాలి తగలక పోవడం, నీరు అధికంగా నిలువ ఉండడం దోమపోటుకు ప్రధాన కారణమని అధికారులు చెబుతున్నారు.

**వ్యాధి లక్షణాలు**

- సుడిదోమ సోకిన చేను పత్రాలు ఒకే రోజులో పసుపురంగులోకి మారి ఎండిపోతున్నాయి.
- గింజల్లో రసంపోయి నల్లబారి తాలు మాదిరిగా మారుతాయి.
- చేను నేలవారి కోతకు వీలు లేకుండా పోతుంది.

**నివారణ చర్యలు**

ప్రతి రోజూ పొలాలను పరిశీలించాలి. గాలి తగిలి, పొలం ఆరడానికి చేనులో పాయలు తొక్కాలి. పొలంలో నీటిని పూర్తిగా బయటకు తీయాలి. నివారణకు పైమెట్రోజోన్, ట్యాప్లీమెజీపిరియం, స్పైడినోటిఫురాన్, బూప్రోఫీజిన్ వంటి రసాయన మందులను వ్యవసాయ అధికారుల సూచనల ప్రకారం చేను మొత్తం తడిచేలా పిచికారీ చేయాలి.

**రైతులు అప్రమత్తంగా ఉండాలి**

సుడిదోమ పోటు విషయంలో రైతులు అప్రమత్తంగా ఉండాలి. లక్షల సంఖ్యలో ఉండే సుడి దోమ.. గంటల వ్యవధిలో చాలా నష్టం కలిగిస్తుంది. నివారణకు రైతులు వీలైనంత వరకు చేనులో పాయలు తొక్కాలి. నీరు పూర్తిగా తీసేసి ఆరబెట్టాలి. చేను దిగువ పత్రాల మొదళ్లకు చేరేలా పై మందులు పిచికారీ చేయాలి.

– వెంకటరమణారెడ్డి, జిల్లా వ్యావసాయ అధికారి

## నేత్రపర్వంగా కల్పవృక్ష సేవ

భువనగిరి: పట్టణ పరిధిలోని స్వర్ణగిరి క్షేత్రంలో జరుగుతున్న పవిత్రోత్సవాల్లో భాగంగా ఆదివారం స్వామివారికి కల్పవృక్షసేవ నేత్రపర్వంగా చేపట్టారు.శ్రీవేంకటేశ్వరస్వామి వారిని పట్టువస్త్రాలు, బంగారు ఆభరణాలతో అలంకరించి ఆలయ మాడవీధుల్లో ఊరేగించారు. భక్తులు స్వామివారిని కనులారా వీక్షించి మొక్కులు తీర్చుకున్నారు. అంతకుముందు ఉదయం ఆలయంలో సుప్రభాత సేవ, తోమాల సేవ, సహస్రనామార్చన, నిత్యకల్యాణం, ఉత్సవమూర్తులకు నవ కలశ పంచామృతాభిషేకం నిర్వహించారు.



కల్పవృక్షంపై ఆలయ మాడ వీధుల్లో ఊరేగుతున్న శ్రీ వేంకటేశ్వర స్వామివారు

## క్లుప్తంగా

### మానసిక వేదనతో యువతి ఆత్మహత్య

మిర్యాలగూడ టౌన్‌: మానసికంగా బాధపడుతున్న యువతి ఇంట్లో ఉరేసుకుని ఆత్మహత్య చేసుకుంది. ఈ ఘటన మిర్యాలగూడ మండలం చింతపల్లి గ్రామ పంచాయతీ పరిధిలోని బుద్ధాతండాలో ఆదివారం జరిగింది. మిర్యాలగూడ రూరల్‌ ఎస్‌ఐ మల్లికంటి లక్ష్మయ్య తెలిపిన వివరాల ప్రకారం.. బుద్ధాతండకు చెందిన బానోతు దాసు కుమార్తె అనుజ(19) హైదరాబాద్‌లోని ఓ సెల్‌ పాయింట్‌లో గత నెల రోజులుగా పనిచేస్తుంది. దసరా పండుగకు వారం రోజుల క్రితం ఇంటికి వచ్చిన అనుజ మానసిక వేదనతో బాధపడుతోంది. ఈ క్రమంలో ఆదివారం ఇంట్లో ఎవరూ లేని సమయంలో చీరతో ఉరేసుకుని ఆత్మహత్య చేసుకుంది. మృతురాలి తండ్రి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ తెలిపారు.

### కుటుంబ సమస్యలతో..

మోత్కూరు: కుటుంబ సమస్యలతో ఉరేసుకుని వ్యక్తి ఆత్మహత్య చేసుకున్నాడు. ఈ ఘటన మోత్కూరు మున్సిపాలిటీ పరిధిలో ఆదివారం రాత్రి జరిగింది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. మోటకొండూరు మండలం తేరాల గ్రామానికి చెందిన ఇంద్రాల మల్లయ్య(45) తన భార్య రాజ్యలక్ష్మితో కలిసి గత 15 ఏళ్లగా మోత్కూరు మున్సిపాలిటీ పరిధిలోని సాయిబాబా కాలనీలో నివాసముంటూ కూలి పనులు చేసుకుంటూ జీవనం సాగిస్తున్నారు. మల్లయ్య కుమార్తె ఐదు నెలల క్రితం మరో వ్యక్తితో వెళ్లిపోవడంతో తీవ్ర మనస్తాపానికి గురయ్యాడు. మానసిక వేదనతో ఆదివారం రాత్రి ఇంట్లో రేకుల పైకప్పుకు చీరతో ఉరేసుకుని ఆత్మహత్య చేసుకున్నాడు. సమాచారం తెలుసుకున్న పోలీసులు ఘటనా స్థలానికి చేరుకుని మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం రామన్నపేట ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. మృతుడి భార్య ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు మోత్కూరు ఎస్‌ఐ కొంపెల్లి సతీష్‌ తెలిపారు.

### ఆర్థిక ఇబ్బందులతో..

చౌటుప్పల్‌: ఆర్థిక ఇబ్బందులతో ఇంట్లో ఫ్యానుకు ఉరేసుకుని వ్యక్తి ఆత్మహత్య చేసుకున్నాడు. ఈ ఘటన చౌటుప్పల్‌ పట్టణ కేంద్రంలో ఆదివారం వెలుగులోకి వచ్చింది. స్థానిక పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. చౌటుప్పల్‌ పట్టణంలోని కంచరకుంట్ల కాలనీలో నివాసముంటున్న కొండ శ్రీనివాస్‌(40) మెకానిక్‌గా పనిచేస్తున్నాడు. ఇటీవల కొత్తగా ఇంటిని నిర్మించుకున్నాడు. ఇంటి నిర్మాణం కోసం బ్యాంకులో రుణం తీసుకోవడంతో పాటు అప్పులు చేశాడు. నెలవారి వాయిదాలు చెల్లించడం ఇబ్బందిగా మారడంతో మద్యానికి బానిసయ్యాడు. ఆర్థిక ఇబ్బందులతో మనస్తాపానికి గురై ఇంట్లో ఫ్యాన్‌కు ఉరేసుకుని ఆత్మహత్య చేసుకున్నాడు. దసరా పండుగకు పిల్లలతో కలిసి పుట్టింటికి వెళ్లిన శ్రీనివాస్‌ భార్య వనజాత ఆదివారం ఉదయం తిరిగి చౌటుప్పల్‌కు చేరుకుంది. ఇంటి తలుపులు పెట్టి ఉండడంతో కిటికీలోంచి లోపలికి చూడగా శ్రీనివాస్‌ ఉరికి వేలాడుతుండటం గమనించింది. చుట్టుపక్కల వారికి విషయం చెప్పడంతో వారు పోలీసులకు సమాచారం ఇచ్చారు. పోలీసులు ఘటనా స్థలానికి చేరుకుని మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం చౌటుప్పల్‌లోని ప్రభుత్వాస్పత్రికి తరలించారు. మృతుడి భార్య ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ మన్మథకుమార్‌ తెలిపారు.

### సూర్యదేవాలయంలో ప్రత్యేక పూజలు

అర్వపల్లి: తిమ్మాపురంలోని అఖండజ్యోతి స్వరూప సూర్యనారాయణస్వామి క్షేత్రంలో భక్తులు ఆదివారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. తెల్లవారుజామున ఉషాపద్మిని ఛాయా సమేత సూర్యనారాయణస్వామిని ప్రత్యేకంగా అలంకరించి అభిషేకాలు జరిపారు. అనంతరం యజ్ఞశాలలో మహాసౌరహోమం నిర్వహించారు. అలాగే క్షేత్ర ఆవరణలోని కార్యసిద్ధి వీరహనుమాన్‌, శ్రీరామకోటి స్థూపాలను కూడా భక్తులు దర్శించుకున్నారు. కాగా వివిధ ప్రాంతాల నుంచి పెద్ద సంఖ్యలో భక్తులు తరలివచ్చారు. స్వామి క్షేత్రానికి తరలివచ్చిన భక్తులకు తీర్థప్రసాదాలు అందజేసి అన్నప్రసాద వితరణ జరిపారు. ఈ కార్యక్రమంలో కాకులారపు రజిత, గణపురం నరేష్‌, కర్నాటి నాగేశ్వర్‌రావు, సత్యనారాయణ, ఇంద్రారెడ్డి, గిరి, బెలిదె లక్ష్మయ్య, అర్చకులు భీంపాండే, శ్రీరాంపాండే, అంకిత్‌పాండే, భక్తులు పాల్గొన్నారు.

# యాదగిరీశుడి క్షేత్రంలో భక్తుల కిటకిట


ముఖ మండపం క్యూలైన్‌లో స్వామి దర్శనం కోసం వేచి ఉన్న భక్తులు


ఆలయ మాడ వీధిలో కిటకిటలాడుతున్న భక్తులు

- స్వామి వారిని దర్శించుకున్న 40వేల మందికి పైగా భక్తులు

యాదగిరిగుట్ట: యాదగిరిగుట్ట లక్ష్మీనరసింహస్వామి ఆలయంలో ఆదివారం భక్తుల రద్దీ నెలకొంది. దసరా సెలవులు సైతం ముగియడంతో స్వామివారిని దర్శించుకునేందుకు భక్తులు అధిక సంఖ్యలో తరలివచ్చారు. దీంతో ఆలయ పరిసరాలు, క్యూలైన్లు, మాడ వీధులు, ప్రసాద విక్రయశాల, క్యూకాంప్లెక్స్‌ ప్రాంతాల్లో భక్తులు అధికంగా కనిపించారు. స్వామి వారి ధర్మ దర్శనానికి మూడు గంటలకు పైగా సమయం పట్టగా, వీఐపీ దర్శనానికి గంట సమయం పట్టింది. ఉదయం వర్షంలో సైతం స్వామిని దర్శించుకునేందుకు భక్తులు అధికంగా వచ్చారు. 40వేల మందికి పైగా భక్తులు స్వామిని దర్శించుకొని మొక్కులు తీర్చుకున్నారు. వివిధ పూజలతో నిత్యాదాయం రూ.50,54,516 వచ్చినట్లు ఆలయాధికారులు వెల్లడించారు.

## వాడపల్లి వద్ద ఆర్డీఆర్‌ అస్థికలు నిమజ్జనం


దామోదర్‌రెడ్డి అస్థికలను నిమజ్జనం చేస్తున్న ఆయన కుమారుడు సర్వోత్తమ్‌రెడ్డి

మిర్యాలగూడ: అనారోగ్యంతో మృతిచెందిన మాజీ మంత్రి రాంరెడ్డి దామోదర్‌రెడ్డి(ఆర్డీఆర్‌) అంత్యక్రియలు శనివారం తుంగతుర్తి మండల కేంద్రంలోని ఆయన వ్యవసాయ క్షేత్రంలో నిర్వహించారు. కాగా.. దామోదర్‌రెడ్డి అస్థికలను ఆదివారం ఆయన కుమారుడు రాంరెడ్డి సర్వోత్తమ్‌రెడ్డితో పాటు కుటుంబ సభ్యులు దామరచర్ల మండలం వాడపల్లిలోని కృష్ణా, మూసీ నదుల సంగమం వద్ద నిమజ్జనం చేశారు. ఈ కార్యక్రమంలో దామోదర్‌రెడ్డి సోదరులు గోపాల్‌రెడ్డి, కృష్ణారెడ్డి, కాంగ్రెస్‌ నాయకులు కొప్పుల వేణారెడ్డి, భాస్కర్‌, జెన్నారెడ్డి ప్రతాప్‌రెడ్డి, చకిల రాజేశ్వర్‌రావు, కోతి గోపాల్‌రెడ్డి, అంజద్‌అలీ, కరుణాకర్‌రెడ్డి పాల్గొన్నారు.

### గుండెపోటుతో దామన్న వీరాభిమాని మృతి


జానపాటి చంద్రయ్య (ఫైల్‌)

అర్వపల్లి: కాంగ్రెస్‌ నాయకుడు, మాజీ మంత్రి దామోదర్‌రెడ్డి వీరాభిమాని, జాజిరెడ్డిగూడెం మండలం కాసర్లపహాడ్‌ గ్రామానికి చెందిన జానపాటి చంద్రయ్య(63) శనివారం అర్ధరాత్రి గుండెపోటుతో మృతిచెందారు. దామోదర్‌రెడ్డి మరణించినప్పటి నుంచి చంద్రయ్య తీవ్రమైన బాధలో ఉన్నాడని, శనివారం తుంగతుర్తిలో దామోదర్‌రెడ్డి అంత్యక్రియలకు వెళ్లి రాత్రి ఇంటికి వచ్చి నిద్రించిన చంద్రయ్య అర్ధరాత్రి గుండెపోటుతో మృతిచెందినట్లు ఆయన కుటుంబ సభ్యులు తెలిపారు. తుంగతుర్తి నియోజకవర్గంలో దామోదర్‌రెడ్డి ఎక్కడికి వచ్చినా చంద్రయ్య ఆయన దగ్గరకు వెళ్లి వస్తాడని గ్రామస్తులు తెలిపారు. చంద్రయ్య భౌతికకాయానికి కాంగ్రెస్‌ నాయకులు నివాళులర్పించారు. ఆదివారం గ్రామంలో అంత్యక్రియలు నిర్వహించారు. మృతుడు చంద్రయ్యకు భార్య, ఒక కుమారుడు, ఇద్దరు కుమార్తెలు ఉన్నారు.

### ఏదుళ్లగూడెంలో మద్యం అమ్మకాలపై నిషేధం

- తీర్మానం చేసిన గ్రామస్తులు

వలిగొండ : వలిగొండ మండల పరిధిలోని ఏదుళ్లగూడెం గ్రామంలో బెల్టుషాపుల్లో మద్యం విక్రయించొద్దని ఆదివారం గ్రామస్తులు తీర్మానం చేశారు. తీర్మానానికి వ్యతిరేకంగా ఎవరైనా మద్యం అమ్మితే రూ.లక్ష జరిమానా విధించి.. ఆ డబ్బును గ్రామ అభివృద్ధికి కేటాయిస్తామని గ్రామస్తులు పేర్కొన్నారు. ఎవరైనా మద్యం అమ్మినట్లు సమాచారం ఇస్తే రూ.10వేల నజరానా అందిస్తామని, వారి పేర్లు గోప్యంగా ఉంచుతామని తెలిపారు. ఈ కార్యక్రమంలో గ్రామస్తులు గూడూరు వెంకట్‌రెడ్డి, ఏనుగు సత్తిరెడ్డి, ఏనుగు వెంకట్‌రెడ్డి, గూడూరు నర్సిరెడ్డి, ఏనుగు యాదిరెడ్డి, కప్పల భిక్షపతి, కుకుంట్ల కిష్టయ్య, నోముల మల్లారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

### మూసీకి పోటెత్తిన వరద


జూలూరు, రుద్రవెల్లి గ్రామాల మధ్యన లోలెవల్‌ బ్రిడ్జి పైనుంచి ప్రవహిస్తున్న మూసీ

భూదాన్‌పోచంపల్లి: హైదరాబాద్‌లో కురుస్తున్న వర్షాలకు వరద మూసీ నదిలోకి వచ్చి చేరుతుండటంతో ఆదివారం తెల్లవారుజామున నుంచి మళ్లీ వరద పోటెత్తింది. దీంతో భూదాన్‌పోచంపల్లి మండలంలోని జూలూరు, రుద్రవెల్లి గ్రామాల మధ్యన లోలెవల్‌ బ్రిడ్జి పైనుంచి మూసీ నది ఉధృతంగా ప్రవహిస్తుండటంతో ఈ మార్గం గుండా పోచంపల్లి నుంచి బీబీనగర్‌కు రాకపోకలను నిలిపివేశారు. భువనగిరి నుంచి పోచంపల్లికి వచ్చే ఆర్టీసీ బస్సు సర్వీసులను కూడా రద్దు చేశారు. దీంతో వివిధ ప్రాంతాల నుంచి వచ్చే ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడ్డారు.

### కారును ఢీకొన్న ట్రావెల్స్‌ బస్సు

- ముగ్గురికి గాయాలు



నుజ్జునుజ్జయిన కారు

చిట్యాల: రెండు ప్రైవేట్‌ ట్రావెల్స్‌ బస్సుల మధ్య నలిగిపోయి కారు నుజ్జునుజ్జవ్వగా.. అందులో ప్రయాణిస్తున్న ముగ్గురికి గాయాలయ్యాయి. ఈ ఘటన విజయవాడ–హైదరాబాద్‌ జాతీయ రహదారిపై చిట్యాల పట్టణ శివారులో ఆదివారం తెల్లవారుజామున జరిగింది. స్థానిక ఎస్‌ఐ రవికుమార్‌ తెలిపిన వివరాల ప్రకారం.. విజయవాడ నుంచి హైదరాబాద్‌ వైపు వెళ్తున్న ఆరెంజ్‌ ట్రావెల్స్‌ బస్సు చిట్యాల పట్టణ శివారులోని ఇండియన్‌ పెట్రోల్‌ బంకు వద్దకు చేరుకోగానే హైవేపై ట్రాఫిక్‌ జాం కావడంతో డ్రైవర్‌ బస్సును రహదారి పైనే నిలిపివేశాడు. బస్సు వెనుకే వస్తున్న కారు సైతం ఆగిపోయింది. అదే సమయంలో కారు వెనుక నుంచి కేవీఆర్‌ ట్రావెల్స్‌ బస్సు అతివేగంగా వచ్చి ఢీకొట్టింది. దీంతో కారు రెండు ట్రావెల్స్‌ బస్సుల మధ్యలో నలిగిపోయి నుజ్జునుజ్జయ్యింది. ఈ ప్రమాదంలో కారులో ప్రయాణిస్తున్న ఏపీలోని కృష్ణా జిల్లా మచిలీపట్నంకు చెందిన గొర్రె జోష్‌కుమార్‌, చల్ల శ్రీహర్షకు తీవ్రగాయాలవ్వగా.. మరొకరికి స్వల్ప గాయాలయ్యాయి. గాయపడిన వారిని చికిత్స నిమిత్తం నార్కట్‌పల్లిలోని కామినేని ఆస్పత్రికి తరలించారు. అతివేగంగా బస్సు నడిపి ప్రమాదానికి కారణమైన కేవీఆర్‌ ట్రావెల్స్‌ బస్సు డ్రైవర్‌ జోవన్నపూడి విజయ్‌కుమార్‌పై కేసు నమోదు చేసినట్లు ఎస్‌ఐ తెలిపారు.

### బాలుడిని కాపాడబోయి మహిళ మృతి

రామగిరి(నల్లగొండ): కాలువలో పడిన బాలుడిని కాపాడబోయి మహిళ మృతిచెందింది. ఈ ఘటన ఆదివారం నల్లగొండ మండలం కొత్తపల్లి గ్రామ శివారులో జరిగింది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. నల్లగొండ మున్సిపాలిటీ పరిధిలోని కతాల్‌గూడకు చెందిన పగడాల అంజలి(28) బట్టలు ఉతికేందుకు కొత్తపల్లి గ్రామ శివారులోని ఎస్‌ఎల్‌బీసీ కాలువ వద్దకు వెళ్లింది. అదే సమయంలో ఈత కొట్టేందుకు కాలువ వద్దకు వచ్చిన జిల్లేపల్లి దీక్షిత్‌ ప్రమాదవశాత్తు నీటిలో పడిపోయాడు. అతడిని రక్షించేందుకు అంజలి నీటిలోకి వెళ్లింది. దీక్షిత్‌ను అక్కడే ఉన్న నారబోయిన రామకృష్ణ రక్షించగా.. అంజలి నీటిలో మునిగిపోయింది. సమీపంలోని బ్రిడ్జి వద్ద అంజలి మృతదేహాన్ని బయటకు తీశారు. మృతురాలి భర్త కిరణ్‌కుమార్‌ ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు నల్లగొండ రూరల్‌ ఎస్‌ఐ సైదాబాబు తెలిపారు.

### హర్షవర్ధన్‌ అంత్యక్రియలు పూర్తి


చౌటుప్పల్‌: హర్షవర్ధన్‌ అంతిమయాత్రలో పాల్గొన్న కుటుంబ సభ్యులు, బంధువులు

చౌటుప్పల్‌: నార్కట్‌పల్లి మండలం జువ్విగూడెం గ్రామ పంచాయతీ పరిధిలోని వెంకటేశ్వర్లబావి గ్రామంలో శనివారం ప్రమాదవశాత్తు నీటి సంపులో మునిగి మృతిచెందిన చౌటుప్పల్‌ పట్టణ కేంద్రానికి చెందిన పోలోజు హర్షవర్ధన్‌(17) అంత్యక్రియలు ఆదివారం సాయంత్రం నిర్వహించారు. హిందూ సాంప్రదాయం ప్రకారం జిల్లేడు చెట్టుతో హర్షవర్ధన్‌కు వివాహం జరిపించి అంతిమయాత్ర నిర్వహించారు. హర్షవర్ధన్‌ భౌతికకాయానికి అతడి తాత నర్సింహాచారి తలకొరివి పెట్టారు. బీజేపీ రాష్ట్ర మాజీ ఉపాధ్యక్షుడు గంగిడి మనోహర్‌రెడ్డి, రాష్ట్ర మాజీ సభ్యుడు దోనూరు వీరారెడ్డి, జిల్లా మాజీ ఉపాధ్యక్షుడు రమనగోని శంకర్‌, అసెంబ్లీ నియోజకవర్గ కన్వీనర్‌ దూడల భిక్షంగౌడ్‌, మున్సిపల్‌ మాజీ ఫ్లోర్‌ లీడర్‌ పోలోజు శ్రీధర్‌బాబు, వివిధ పార్టీల నాయకులు, ఆర్‌ఎస్‌ఎస్‌, యువజన సంఘాల ప్రతినిధులు, మృతుడి స్నేహితులు, తదితరులు నివాళులర్పించారు. మృతుడి తల్లిదండ్రులు శ్రీనివాసచారి–శ్రావణిలను ఓదార్చారు.

**రిషిక్‌ నేత్రాలు లయన్స్‌ క్లబ్‌కు దానం**

నార్కట్‌పల్లి: ఇదే ప్రమాదంలో మృతిచెందిన నార్కట్‌పల్లి మండల కేంద్రానికి చెందిన నల్లగొండ రిషిక్‌(17) నేత్రాలను అతడి తల్లిదండ్రులు నాగరాజు, స్వాతి నార్కట్‌పల్లి లయన్స్‌ క్లబ్‌కు దానం చేశారు. అనంతరం నార్కట్‌పల్లి పట్టణ కేంద్రంలో నిర్వహించిన అంత్యక్రియల్లో పలువురు పాల్గొని నివాళులర్పించారు.

### రసాయన వ్యర్థాలు తిని గొర్రెలు మృతి

చిట్యాల: రసాయన వ్యర్థాలు తిని నాలుగు గొర్రెలు మృతి చెందగా, మరికొన్ని గొర్రెలు అస్వస్థతకు గురయ్యాయి. బాధితుడు తెలిపిన వివరాల ప్రకారం.. చిట్యాల మండలం పిట్టంపల్లి గ్రామ పరిధిలోని నార గుట్ట సమీపంలో గల భూముల్లో ఇటీవల కొందరు రసాయన వ్యర్థాలతో కూడిన సంచులను వదిలి వెళ్లారు. అదే గ్రామానికి చెందిన గొర్రెల పెంపకందారుడు మెట్టు లింగయ్యకు చెందిన మూడు గొర్రెలు ఆ రసాయన వ్యర్థాలను తిని శనివారం మృతి చెందగా.. ఆదివారం మరో గొర్రె మృతి చెందింది. మరికొన్ని గొర్రెలు అస్వస్థతకు గురయ్యాయి. పశువైద్యాధికారులకు సమాచారం ఇవ్వడంతో అస్వస్థతకు గురైన గొర్రెలకు చికిత్స చేశారు.

- పచ్చని చెట్ల పందిరి


మోతె: హరితహారం కార్యక్రమంలో భాగంగా రోడ్ల వెంట నాటిన మొక్కలు చెట్లుగా మారి ఆహ్లాదాన్ని పంచుతున్నాయి. మోతె మండలం విభళాపురం–మామిళ్లగూడెం గ్రామాల మధ్య రోడ్డుకు ఇరువైపులా దట్టంగా పెరిగిన పచ్చని చెట్లు వాహనదారులను ఆకట్టుకుంటున్నాయి.

## చదువుతో పాటు క్రీడల్లోనూ రాణించాలి


గెలుపొందిన జట్టుకు బహుమతులు అందజేసిన ఎంఎస్‌కే ప్రసాద్‌

- భారత క్రికెట్‌ మాజీ చీఫ్‌ సెలెక్టర్‌ ఎంఎస్‌కే ప్రసాద్‌

సూర్యాపేట: విద్యార్థులు చదువుతో పాటు క్రీడల్లోనూ రాణించాలని భారత క్రికెట్‌ మాజీ చీఫ్‌ సెలెక్టర్‌ ఎంఎస్‌కే ప్రసాద్‌ అన్నారు. సూర్యాపేట జిల్లా కేంద్రంలో ఎంఎస్‌కే ప్రసాద్‌ ఇంటర్నేషనల్‌ క్రికెట్‌ అకాడమీ ఆధ్వర్యంలో పది రోజుల పాటు నిర్వహించిన ఎంఎస్‌కే ఐసీఏ అండర్‌–16 క్రికెట్‌ టోర్నమెంట్‌లో గెలుపొందిన వారికి ఆదివారం రాత్రి ఆయన బహుమతులు అందజేసి మాట్లాడారు. గ్రామీణ ప్రాంతాల్లోని క్రీడాకారుల నైపుణ్యాన్ని వెలికితీసేందుకు టోర్నమెంట్‌లు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. క్రీడలతో శారీరక దారుఢ్యం, మానసికోల్లాసం కల్గుతాయన్నారు. ఈ టోర్నమెంట్‌లో ఫ్రీడమ్‌ క్రికెట్‌ అకాడమీ, నల్లగొండ వారికి ప్రథమ బహుమతి లభించగా.. ఎంఎస్‌కే ప్రసాద్‌ క్రికెట్‌ అకాడమీ, సూర్యాపేట వారు ద్వితీయ బహుమతి గెలుచుకున్నారు. ఈ కార్యక్రమంలో అర్జున అవార్డు గ్రహీత నాగపురి రమేష్‌, నల్లగొండ జిల్లా సెక్రటరీ సయ్యద్‌ అమీబాబా, డాక్టర్‌ సందీప్‌, మున్సిపల్‌ ఎన్విరాన్‌మెంట్‌ ఇంజనీర్‌ శివప్రసాద్‌, శ్రీనివాస్‌రెడ్డి, మేనేజర్‌ భరత్‌, హెడ్‌ కోచ్‌ ఉస్మద్‌ తదితరులు పాల్గొన్నారు.

## 11న మహ్మద్‌ ప్రవక్త జీవిత చరిత్రపై రాత పరీక్ష

భువనగిరిటౌన్‌ : భువనగిరి పట్టణంలోని జలీల్‌పుర మసీదు వద్ద ఈ నెల 11న మహ్మద్‌ ప్రవక్త జీవిత చరిత్రపై రాత పరీక్ష నిర్వహిస్తున్నట్లు మసీదు కమిటీ ప్రతినిధులు తెలిపారు. రాత పరీక్షకు సంబంధించిన పోస్టర్‌ను ఆదివారం మసీదు కమిటీ ప్రతినిధులు ఆవిష్కరించారు. ఈ సందర్భంగా కమిటీ అధ్యక్షుడు ఇక్బాల్‌ చౌదరి, సుజావుద్దీన్‌ మాట్లాడుతూ.. యువతకు మహమ్మద్‌ ప్రవక్త జీవిత చరిత్రపై అవగాహన కల్పించేందుకు రాత పరీక్ష నిర్వహిస్తున్నామని తెలిపారు. ఈ పరీక్షలో పదో తరగతి, ఇంటర్మీడియట్‌, డిగ్రీ చదువుతున్న విద్యార్థులు పాల్గొనవచ్చన్నారు. ఆసక్తి కలవారు ఈ నెల 10వ తేదీ వరకు పేర్లు నమోదు చేసుకోవాలని సూచించారు. 11వ తేదీ ఉదయం 10గంటల నుంచి 11గంటల వరకు స్థానిక ఖదీమ్‌ జామియా ఇస్లామీయ అరబియా జలీల్‌పురాలో రాత పరీక్ష ఉంటుందని పేర్కొన్నారు. మొదటి బహుమతి పొందిన వారికి రూ.5 వేలు, రెండో బహుమతి రూ.3వేలు, మూడో బహుమతి రూ.2వేలు అందజేస్తామని తెలిపారు. మరిన్ని వివరాలకు 9390993166, 9515932347, 9640093174, 9515585446 నంబర్లను సంప్రదించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో కమిటీ గౌరవ సలహాదారుడు అబ్దుల్‌ మతిన్‌, కమిటీ సభ్యులు మొహమ్మద్‌ ముస్తఫా, అబ్దుల్‌ ఖదీర్‌, నాసర్‌, వహీద్‌ తదితరులు పాల్గొన్నారు.

## అమెరికాలో బతుకమ్మ, దసరా వేడుకలు

మోటకొండూర్‌: అమెరికాలోని మేరీల్యాండ్‌లో బతుకమ్మ, దసరా వేడుకలను ప్రవాస భారతీయులు ఘనంగా జరుపుకున్నారు. ఈ సందర్భంగా పూలతో అందంగా బతుకమ్మలను పేర్చి ఆడారు. అదే విధంగా అలాయ్‌ బలాయ్‌తో దసరా శుభాకాంక్షలు తెలుపుకున్నారు. మోటకొండూర్‌ మండలంలోని కాటేపల్లి గ్రామానికి చెందిన పచ్చిమట్ల పాండుతో పాటు జీత్‌, ఫణీ జాలువంచ, ఉత్కల్‌, గోపి, ప్రసన్న, గోపి, ప్రసన్న, రోజారెడ్డి, జ్యోత్స్న, త్రివేణి, సంజయ్‌, స్వప్న ఈ వేడుకల్లో పాల్గొన్నారు.


బతుకమ్మలను తీసుకొస్తున్న కాటేపల్లి గ్రామస్తులు

### రెండు బైక్‌లు ఢీ.. ఇద్దరికి గాయాలు

డిండి: రెండు బైక్‌లు ఎదురెదురుగా ఢీకొన్న ఘటనలో ఇద్దరు వ్యక్తులకు తీవ్ర గాయాలయ్యాయి. ఈ ఘటన ఆదివారం డిండి మండల కేంద్రంలో జరిగింది. గ్రామస్తులు తెలిపిన వివరాల ప్రకారం.. డిండి మండల కేంద్రానికి చెందిన అనిల్‌ బైక్‌పై తహసీల్దార్‌ కార్యాలయం వైపు వెళ్తున్నాడు. అదే సమయంలో స్థానిక వ్యవసాయ మార్కెట్‌ యార్డు వద్ద ఉన్న జంక్షన్‌ నుంచి డిండి మండల కేంద్రానికే చెందిన నరేష్‌ బైక్‌పై రోడ్డు క్రాస్‌ చేస్తుండగా.. అనిల్‌ బైక్‌తో ఢీకొట్టింది. దీంతో వారిద్దరికి గాయాలయ్యాయి. చికిత్స నిమిత్తం నరేష్‌ను నల్లగొండకు, అనిల్‌ను నాగర్‌కర్నూల్‌కు తరలించారు.

### మరమరాల ప్యాకెట్‌లో ఫంగస్‌



ఫంగస్‌తో కూడిన మరమరాలు

రాజాపేట: రాజాపేట మండల కేంద్రంలోని ఓ కిరాణ దుకాణంలో ఆదివారం ఓ వ్యక్తి మరమరాల ప్యాకెట్‌ కొనుగోలు చేశాడు. ప్యాకెట్‌ తెరిచిచూడగా అందులో ఫంగస్‌(బూజు)తో కూడిన మరమరాలు కనిపించాయి. ప్యాకెట్‌పై ట్రేడ్‌మార్క్‌ నంబర్‌తో పాటు 2025 ఆగస్టు 4న తయారు చేసినట్లు ఉంది. మార్కెట్లోకి వచ్చే ఇలాంటి ప్యాకెట్లపై ఫుడ్‌ సేఫ్టీ అధికారులు దృష్టిసారించాలని వినియోగదారులు కోరుతున్నారు.

### చెరువుల్లో సందడి

రాజాపేట: ఇటీవల కురిసిన వర్షాలకు రాజాపేట మండలంలోని మల్లగూడెం, జాల, పాముకుంట, కుర్రారం గ్రామాల చెరువులు నిండి అలుగు పోస్తున్నాయి. వ్యాపార, ఉద్యోగ రీత్యా పట్టణాల్లో ఉంటున్నవారు దసరా పండుగకు స్వగ్రామాలకు వచ్చి ఆనందంగా గడిపారు. ఆదివారంతో సెలవులు ముగియడంతో తిరిగి పట్టణాలకు వెళ్లే క్రమంలో జాల, రాజాపేట, పాముకుంట గ్రామాల్లో అలుగు పోస్తున్న చెరువుల్లో తమ పిల్లలతో కలిసి సందడి చేశారు. మహిళలు, చిన్నారులు సెల్ఫీలు దిగుతూ చెరువు నీటిలో ఆనందంగా గడిపారు.


జాల గ్రామ పరిధిలోని చెరువులో ఫొటోలు, సెల్ఫీలు దిగుతున్న మహిళలు

